వైఎస్ఆర్ కడప వార్త

తెలుగు జాతీయ దినపత్రిక

ఆదివారం 03 మే 2026




## వెళ్లాలలో భక్తిశ్రద్ధలతో గరుడోత్సవం

రాజుపాళెం, మే 2, ప్రభాతవార్త:





మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెళ్లాలలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి స్వామి వారి గరుడోత్సవం ఎంతో వైభవంగా జరిగినది. మూలవిరాట్ శ్రీ చెన్నకేశవ స్వామి శ్రీదేవి, భూదేవి సమేతంగా గరుడ వాహనం పైన అర్ధరాత్రి వేళ మాడవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. దీంతో పాటు శివుడు గంగా పార్వతి సమేతంగా ప్రత్యేక వాహనంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ గరుడోత్సవ సేవ ఉత్సవ కమిటీ చైర్మన్ జి.ఎల్ నారాయణరెడ్డి, వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించడమైనది. భక్తులకు వినోదాత్మకంగా గానకచేరి కార్యక్రమంలో ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి శ్రీ చెన్నకేశవ స్వామి సతి సమేతంగా గజ వాహనం పైన భక్తులకు దర్శనమిచ్చారు.

## వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం

పెండ్లిమర్రి, మే 2, ప్రభాతవార్త:

మండలంలోని వెయ్యినూతుల కోనం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో శనివారం వైభవంగా లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణం జరిగింది. ఆలయ ధర్మకర్త హరిప్రసాద్ దంపతులు పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. ఈ కల్యాణానికి ఆలయ ధర్మకర్త హరిప్రసాద్ అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులకు భారీగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా సీఐ చల్లని దొర బందోబస్తు ఏర్పాటు చేశారు.



# జలధార పనులను నిబద్ధతతో పూర్తి చేయండి





కడప, మే 5 ప్రభాతవార్త :

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జలధార' కార్యక్రమం పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. శనివారం రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సభా భవనంలో సబ్ కలెక్టర్ భావనతో కలిసి ఆయన రాజంపేట నియోజకవర్గంలోని ఆరు మండలాల ఎంపీడీవోలు, తహశీల్దార్లు, ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జలధార కార్యక్రమంతో పాటు జనగణన, ఎన్ఆర్ఈజీఎస్ (ఉపాధి హామీ) పనుల పురోగతిపై ఆయన అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జలధార జలహారతి కార్యక్రమంలో భాగంగా రాజంపేట నియోజకవర్గంలోని ఆరు మండలాలలో గుర్తించిన పనులన్నింటినీ ఉపాధి హామీ పనుల కింద నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. చెరువులలో పూడిక పనులను గుర్తించి, ఆ మట్టిని(సిల్ట్ )రైతులు, గ్రామస్తులు ఉచితంగా తీసుకెళ్లేలా ప్రోత్సహించాలని సూచించారు. ఈ అంశంపై అధికారులు గ్రామాల్లో టామ్ టామ్ వేయించి గ్రామ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఫీడర్ కెనాల్ లలో మళ్లింపు (డైవర్షన్) లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా, ఎంపీడీవోలు ప్రతిరోజూ ఉదయం క్షేత్రస్థాయిలో పర్యటించి ఉపాధి హామీ పనులను పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల్లో ఉపాధి హామీ కూలీల సంఖ్యను పెంచాలని, పనుల్లో వేగం పెంచేలా గ్రామసభలు నిర్వహించాలని సూచించారు. జలధార యాప్‌లో ఎటువంటి పెండింగ్ లేకుండా సమాచారాన్ని ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని అధికారులకు సూచించారు. అంతకుముందు, జిల్లా కలెక్టర్ నందలూరు మండలంలోని లేపాకు చెరువు, మర్రిపల్లి ఫీడర్ కెనాల్ పనులను పరిశీలించి, క్షేత్రస్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి, ఎంపీడీవోలు, ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులు, ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## చెరువుల కబ్జాలు తొలగించండి

అధికారులకు కలెక్టర్ శ్రీధర్ ఆదేశాలు



నందలూరు, మే 2 ప్రభాతవార్త:

మండలంలోని చెరువులపై ఉన్న కబ్జాలను వెంటనే తొలగించాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ తహసీల్దార్ శివలక్ష్మికి ఆదేశించారు. శనివారం జలధార–జలహారతి కార్యక్రమంలో భాగంగా లేబాక చెరువు మరియు ఆడపూరు గ్రామపంచాయతీ పరిధిలోని మర్రిపల్లెలో చెరువుకు నీరందించే కాలువను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువుల నీటి నిల్వలు, వినియోగం, భూగర్భ జలాల పరిస్థితి, రైతులకు కలిగే ప్రయోజనాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెరువుల పరిరక్షణతో పాటు ఆక్రమణలను తొలగించడం అత్యవసరమని స్పష్టం చేశారు. జలధార–జలభద్రత కార్యక్రమంలో భాగంగా తొలి విడతలోనే లేబాక చెరువు అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ ఇంచార్జ్ ఎల్లటూరు శ్రీనివాసరాజు, మాజీ జెడ్పిటిసి శివరామరాజు, నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, ఇరిగేషన్ ఎస్ఈ షమీ, ఈఈ చంగల్‌రాయుడు, డీఈ జగదీశ్వర్‌రెడ్డి, ఏఈలు పరుశురాం, మధుసూదన్‌రావు, ఎంపీడీవో కేఆర్ఎం ప్రసాద్, ఏపీవో మురళి తదితరులు పాల్గొన్నారు.

## తాళ్లపాకలో వైభవంగా శ్రీవారి కల్యాణం



శ్రీవారి మంగళసూత్రాన్ని భక్తులకు చూపుతున్న అర్చకుడు

రాజంపేట, మే 2 ప్రభాతవార్త

అన్నమయ్య కీర్తనల మధ్య శ్రీవారి దివ్య కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. కళ్యాణం సందర్భంగా గోవింద నామస్మరణతో తాళ్లపాక మారుమోగింది. శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల 618వ జయంతి ఉత్సవాలు శనివారం అన్నమయ్య జిల్లా తాళ్లపాకలో ఘనంగా ప్రారంభమయ్యాయి. తాళ్లపాకలోని ధ్యానమందిరం వద్ద ఉదయం శ్రీవారి దివ్య కల్యాణం కన్నులపండువగా జరిగింది. ఉదయం 10 గంటలకు వేద పండితులు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవమూర్తులను కల్యాణవేదికకు తీసుకువచ్చారు. ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు అర్చకుల వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. పుణ్యాహవచనం, పవిత్ర హోమం, కంకణధారణ, మాంగళ్యధారణ, మంగళాశాసనం వంటి ఘట్టాలతో కల్యాణం వైభవంగా జరిగింది. చివరిగా నక్షత్రహారతి, మంగళహారతులతో కార్యక్రమం ముగిసింది. టీటీడీ భక్తులకు మంచినీరు, మజ్జిగ, ప్రసాదాలు అందించగా, అనంతరం పెద్దసంఖ్యలో భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు. అంతకుముందు ఉదయం 9 నుండి 10 గంటల వరకు అన్నమయ్య ధ్యాన మందిరం వద్ద అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు సప్తగిరి సంకీర్తనల గోష్ఠిగానం నిర్వహించి భక్తులను ఆధ్యాత్మిక లోకంలోకి తీసుకెళ్లారు. సాయంత్రం 6.30 నుండి రాత్రి 8 గంటల వరకు చెన్నైకు చెందిన డా. తాళ్లపాక మీనలోచని సంగీత సభ, రాత్రి 7.30 గంటలకు కర్నూలుకు చెందిన శ్రీమతి లక్ష్మీ మహేష్ బృందం హరికథ గానం నిర్వహించనున్నారు. కళ్యాణ సందర్భంగా ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథరెడ్డి, రాజంపేట మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్ రెడ్డిలు స్వామిని దర్శించుకున్నారు. అలాగే జనసేన పార్లమెంట్ ఇంచార్జి ఎల్లటూరు శ్రీనివాసరాజు స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయనను సన్మానించారు.



శ్రీవారి కళ్యాణ క్రతువు నిర్వహిస్తున్న వేద పండితులు

### అన్నమయ్య విగ్రహం వద్ద ఊంజల్ సేవ వైభవం

రాజంపేట–కడప రహదారిపై ఉన్న 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వద్ద శనివారం సాయంత్రం 6.30 నుండి 7.30 గంటల వరకు శ్రీవారి ఊంజల్ సేవ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు అన్నమయ్య కీర్తనలను ఆలపించారు. అనంతరం రాత్రి 7.30 గంటలకు ప్రొద్దుటూరుకు చెందిన శ్రీ రమణయ్య బృందం హరికథ కార్యక్రమం నిర్వహించారు. శ్రీవారి కల్యాణం, జయంతి వేడుకల్లో పలువురు అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

### కొల్లా వారి పల్లె మిట్ట హరిజనవాడ

## సమస్యల పరిష్కారానికి యల్లటూరి హామీ



కొల్లావారిపల్లె హరిజనవాడలో పర్యటిస్తున్న శ్రీనివాసరాజు

రాజంపేట, మే 2 ప్రభాతవార్త

మండలంలోని కొల్లవారిపల్లె పంచాయతీ మిట్ట హరిజనవాడలోసమస్యల పరిష్కారానికి జనసేన పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్ ఎల్లటూరి శ్రీనివాసరాజు హామీ ఇచ్చారు. శనివారం ఆయన పార్టీ నాయకులతో కలిసి స్థానికుల ఆహ్వానం మేరకు మిట్ట హరిజనవాడలో పర్యటించారు. దళితులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. హరిజనవాడలో ఎదుర్కొంటున్న సమస్యలనుతిప్పన చెంగళరాయుడు, గ్రామస్తులు వివరించారు. అధికారులు దృష్టికి తీసుకుపోయి వీలైనంత త్వరలో సమస్యలు పరిష్కరిస్తామని శ్రీనివాసరాజు వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అబూబకర్, సుధా, హరికృష్ణ, గుడిసి సుబ్రహ్మణ్యం, మన్నెం ఓబయ్య, రమణయ్య, పెంచలయ్య, జంబు సుధాకర్, సుబ్రహ్మణ్యం, మిట్ట హరి, మలగాసి రాజ్‌కుమార్, తిప్పనమణి తదితరులు పాల్గొన్నారు.

### మహిళల ప్రపంచ కప్ టోర్నీకి

## ఇండియా జట్టుకు కడప బిడ్డ శ్రీ చరణి

రాజంపేట, మే 2 ప్రభాతవార్త

కడప బిడ్డ శ్రీ చరణ్ మరో అద్భుతం చేసింది. తన అసమాన ప్రతిభతో ఐసిసి వరల్డ్ కప్ టోర్నీకి భారత మహిళల జట్టులో స్థానం పొందారు. ఈ మేరకు శనివారం సాయంత్రం భారత్ మహిళల జట్టును ప్రకటించింది. గత ఏడాది జరిగిన మహిళల ప్రపంచ కప్ లో కూడా స్థానం పొందిన శ్రీచరిణి తాజాగా వరల్డ్ కప్ 20 20 జట్టుకు కూడా ఎంపిక పట్ల జిల్లాలో సర్వత్ర హర్షం వ్యక్తం అవుతుంది. ప్రధానంగా క్రికెట్ అభిమానులు శ్రీచరిని ఎంపిక ఎంపిక కావడం సంచలనంగా భావిస్తున్నారు. శ్రీచరిని ఎంపిక రాష్ట్రానికే గర్వకారణం అని క్రికెట్ అభిమానులు పేర్కొంటున్నారు. కేవలం ఏడాది కాలంలోనే రెండు ప్రపంచ క్రికెట్ టోర్నీలు ఆడడం కడప క్రికెట్ చరిత్రలో నిలిచిపోనుంది. నల్లపురెడ్డి శ్రీచరణి, ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ లో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున ఎంపికై క్రికెట్లో అరంగేట్రం చేసిన శ్రీచరిణి క్రికెట్ లో అమ్మాయిలకు స్ఫూర్తిగా నిల్చనుంది. మారుమూలగ్రామంనుంచి క్రికెట్లో ఓనమాలు దుద్దుకొని అంతర్జాతీయ స్థాయికి ఎదగడం సామాన్యమైన విషయం కాదు. క్రికెట్ నేర్చుకోవాలనే అమ్మాయిలకు శ్రీచరని ఒక ఆదర్శంగా నిలవనుంది.




### శ్రీశ్రీ కస్తూరమ్మకు

## తిరుణాల మహోత్సవం..

సుండుపల్లె, మే 02,ప్రభాతవార్త:



శ్రీ శ్రీ కస్తూరమ్మకు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. మండలంలోని పెద్దినేని కాలువ గ్రామపంచాయతీ సత్రం సమీపంలో వెలసిన శ్రీ శ్రీ కస్తూరమ్మ తిరుణాల మహోత్సవ సందర్భంగా శనివారం అమ్మవారికి అభిషేకము కుంకుమార్చన మంగళహారతి నిర్వహించారు. అలాగే ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలతో పాటు జల్దికిపోవుట, పుట్టక పూజించడం రాత్రికి ఆశాధికత నిర్వహించడం జరుగుతుందన్నారు. సోమవారం మధ్యాహ్నం గావు పట్టుట, హిందూ బంధువులం శ్రీరాముని సేవకులం ఆధ్వర్యంలో సాయంత్రం 6 గంటలకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. అదే రోజు రాత్రి 8 గంటలకు భక్తి గేయాలతో కడప కళాకారుల బృందం, పీలేరు కళాకారుల బృందం సౌజన్యంతో అంగరంగ వైభవంగా శ్రీ శ్రీ కస్తూరమ్మ అమ్మవారి తిరుణాల మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తిరుణాల మహోత్సవాన్ని నిర్వహించేందుకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. మండల నలమూలలతో పాటు కెవి పల్లి పీలేరు రాజంపేట వంటి సుద్దుల ప్రాంతాల నుండి ఈ తిరుణాల మహోత్సవాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## పెనుగాలులకు అరటి తోటలు దెబ్బతిన్నాయి



దెబ్బ తిన్న అరటి పంటను పరిశీలిస్తున్న ఉద్యాన వన శాఖ అధికారి రాఘవేంద్ర రెడ్డి


పులివెందుల, మే 2 , ప్రభాతవార్త :


అకాలంగా వీచిన పెనుగాలుల ప్రభావంతో పులివెందుల మండలంలోని నల్లపురెడ్డిపల్లె గ్రామంలో అరటి తోటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో పులివెందుల ఇంచార్జ్ ఉద్యాన అధికారి రాఘవేంద్ర రెడ్డి శుక్రవారం గ్రామాన్ని సందర్శించి నష్టపోయిన అరటి తోటలను పరిశీలించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ, పంట నష్టం ఎదుర్కొన్న రైతులు గ్రామంలోని రైతు సేవా కేంద్ర సిబ్బందికి వెంటనే సమాచారం అందించి తమ పొలాల వివరాలను నష్టపరిహార నివేదికల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే రైతులు తమ పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంక్ ఖాతా వివరాలు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో సమర్పించాలని తెలిపారు. పులివెందుల మండల వ్యాప్తంగా మొత్తం 205 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా నివేదికలను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపినట్లు ఉద్యాన అధికారి రాఘవేంద్ర రెడ్డి వెల్లడించారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తగిన పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

## తక్కువ వర్షపాతంలోనూ మొలకెత్తే విత్తన గుళికలు




సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించే దిశగా రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో మైదుకూరు మండలంలోని నంద్యాలంపేట యూనిట్ పరిధిలోని సుంకులుగారిపల్లి గ్రామంలో విత్తన గుళికల తయారీ (సీడ్ పెల్లెటైజేషన్) మరియు ప్రీమాన్సూన్ డ్రై సోయింగ్ పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం రైతు సుబ్బరామి రెడ్డి పొలంలో నిర్వహించగా, ఒక ఎకరా విస్తీర్ణంలో సుమారు 30 కిలోల విత్తనాలను గుళికల రూపంలో తయారు చేసి ముందస్తుగా విత్తడం చేపట్టారు. వర్షాకాలానికి ముందే ఈ విధానం అనుసరించడం ద్వారా వర్షం పడగానే పంట త్వరగా స్థిరపడే అవకాశముందని తెలిపారు. అదనంగా, సాధారణంగా విత్తనాలు మొలకెత్తడానికి 22–25 మిల్లీమీటర్ల వర్షపాతం అవసరమవుతుండగా, విత్తన గుళికల విధానం ద్వారా కేవలం 10–15 మిల్లీమీటర్ల వర్షపాతంలోనే విత్తనాలు మొలకలు సాధ్యమవుతాయని అధికారులు వివరించారు. ఈ విధానం వర్షాభావ పరిస్థితుల్లో రైతులకు ఎంతో ఉపయోగకరమని చెప్పారు. ఇక పీఎండీఎస్ విధానంలో విత్తనాలు వేసిన తర్వాత 40 రోజులకి పూత దశలో నేలలో కలియదున్నడం వల్ల నేలలో జీవ వైవిధ్యం పెరుగుతుందని, నేల ఆరోగ్యం మెరుగుపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పుష్పాంజలి (NFF-MM), సుబ్బ రాజు (DMMT), బాలయ్య (DMMT) పాల్గొని రైతులకు ప్రాక్టికల్‌గా మార్గదర్శనం చేశారు. స్థానిక రైతులు ఈ పద్ధతిపై ఆసక్తి కనబరిచి సహజ వ్యవసాయ పద్ధతులను అవలంబించేందుకు ముందుకు రావాలని అధికారులు సూచించారు.





### రీకౌంటింగ్ మరియు రీవెరిఫికేషన్

## ప్రక్రియకు దరఖాస్తుల ఆహ్వానం

కడప మే 02 ప్రభాతవార్త

మార్చి 2026లో జరిగిన SSC (పదవ తరగతి) పబ్లిక్ పరీక్షలకు సంబంధించి, జవాబు పత్రాల రీకౌంటింగ్ మరియు రీవెరిఫికేషన్ కోసం ఆన్‌లైన్ లో దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం, డైరెక్టర్ డాక్టర్ కె.వి. శ్రీనివాసులు రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల (మే) ఒకటవ తేదీ (శుక్రవారం) నుండి ఏడవ తేదీ (గురువారం) వరకు అభ్యర్థులు తమ సంబంధిత పాఠశాల లాగిన్ ద్వారా దరఖాస్తు చేసు కోవాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు తమ పాఠశాల ప్రధానోపాధ్యాయులను సంప్రదించి దరఖాస్తును సమర్పించాల్సి ఉంటుందన్నారు. రీకౌంటింగ్ కు ఒక సబ్జెక్టుకు రూ .500/, రీవెరిఫికేషన్ కు ఒక సబ్జెక్టుకు ..రూ.1,000/ అభ్యర్థులు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

ఫీజును కేవలం www.bse.ap.gov. వెబ్‌సైట్‌లోని ఆన్‌లైన్ పేమెంట్ గేట్‌వే (Debit Card / Credit Card / Net Banking / UPI) ద్వారా మాత్రమే చెల్లించాలన్నారు. దినీలీళీ సిటిజన్ చలానా ద్వారా చెల్లింపులు స్వీకరించబడవన్నారు. జవాబు పత్రాల డౌన్‌లోడ్ సదుపాయం కల్పించబడిందని గత సంవత్సరాల్లో రీవెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల జవాబు పత్రాలు కేవలం స్కూల్ లాగిన్‌లో మాత్రమే అందుబాటులో ఉండేవన్నారు. అయితే, ఈ ఏడాది నుండి అదనంగా విద్యార్థుల సౌకర్యార్థం WhatsApp Governance (Mana Mitra service: 9552300009) ద్వారా కూడా స్కాన్ చేసిన జవాబు పత్రాలను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించబడిందన్నారు.

## అన్నమయ్య గొప్ప సంఘ సంస్కర్త

వేంపల్లి:మే 02 ప్రభాతవార్త



పద కవితా పితామహుడు, తెలుగులో తొలి వాగ్గేయ కారుడు, భక్తకవి, వెంకటేశ్వర స్వామి పరమ భక్తుడు అయిన తాళ్లపాక అన్నమాచార్య గొప్ప సంఘసంస్కర్త కూడా అని రాజ్యసభ మాజీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నరెడ్డి తులసి రెడ్డి కొనియాడారు. శనివారం వేంపల్లిలో కాంగ్రెస్ నాయకులు అన్నమయ్య 618 వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ తాళ్లపాక అన్నమాచార్య 32 వేలకు పైగా సంకీర్తనలు రాశాడని, ఆయన సంకీర్తనల్లో భక్తి,సమానత్వం, మానవత్వం, నీతి, జీవన సత్యాలు ప్రతిబింబిస్తాయి అని అన్నారు. మెండైన బ్రాహ్మణుడు మెట్టు భూమి ఒకటే చండాలుదుండేటి సరి భూమి ఒకటే అనే సమానత్వ, సామ్యవాద సిద్ధాంతాన్ని 600 సంవత్సరాల క్రితమే ప్రచారం చేసిన గొప్ప సంఘసంస్కర్త అన్నారు. తెలుగు సాహిత్యానికి అన్నమయ్య ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ధ్రువ కుమార్ రెడ్డి,వేంపల్లి మండల శాఖ అధ్యక్షులు బీగాల రామకృష్ణ,సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి,ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, బద్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## సత్యబండపై ప్రమాణాల జోరు



చౌడేపల్లి, మే 2 ప్రభాతవార్త

సత్య ప్రమాణాలకు పేరుగాంచిన రాజనాబండపై శనివారం ప్రమాణాల జోరు కొనసాగింది. రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో కక్షిదారులు తరలి రావడంతో బండపై రద్దీ కనిపించింది. ప్రధానార్చకుడు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి, క్షేత్ర పాలకుడు ప్రసన్న అంజనేయస్వాములకు విశేష పూజలు నిర్వహించారు. మదనపల్లి, నిమ్మనపల్లి, మామడుగు తదితర ప్రాంతాల నుంచి అనుమానితులు, సొమ్ము పోగొట్టుకొన్నవారు వచ్చారు. కొందరు ప్రమాణాలు చేయగా మరికొందరు వాయిదా వేసుకొని వెళ్ళారు. టిటిడి అధికారులు, ఆలయ అధికార, అర్చక, సిబ్బంది భక్తులకు సేవలందించారు.


## కృష్ణారెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి



కలికిరి, మే 2, ప్రభాతవార్త:

మండలంలోని గుట్టపాలెం పంచాయతీకి చెందిన కృష్ణారెడ్డి కుటుంబాన్ని శనివారం ఉమ్మడి రాష్ట్ర మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డిలు పరామర్శించారు. కృష్ణారెడ్డి గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందాడు. కృష్ణారెడ్డి నల్లారి కుటుంబానికి వీర విధేయుడు. ఆయన మృతి విషయం తెలుసుకున్న మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తమ కుటుంబానికి నల్లారి కుటుంబం ఎప్పుడు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కలికిరి మండలం బీజేపీ నాయకులు రెడ్డప్పరెడ్డి, కలికిరి మండలం టీడీపీ అధ్యక్షులు షాబుద్దీన్, గుట్టపాలెం పంచాయతీ టీడీపీ నాయకులు కంభం వెంకట రమణారెడ్డి, మాజీసీఎం వ్యక్తిగత కార్యదర్శి కృష్ణప్ప, కలికిరి మార్కెట్ యార్డ్ ఛైర్మన్ మాలతి, పలువురు పాల్గొన్నారు.

## అంకాళమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



కలికిరి, మే 2, ప్రభాతవార్త:

కలికిరి-కలకడ రోడ్డు మార్గంలో కలికిరి గ్రామ దేవతగా వెలసిన శ్రీ అంకాళమ్మ ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. బుద్ధ పౌర్ణమి సందర్భంగా ప్రతి ఏడాది అంకాళమ్మ అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేసి పుష్ప పల్లకిలో ఊరేగింపు కార్యక్రమాలు ఆలయ నిర్వాహకులు చేపట్టడం జరుగున్నది. ఈసందర్భంగా శుక్ర, శనివారాలు ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ ఆవరణంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. దీంతో కార్యక్రమం విజయవంతమైంది.

## ప్రమాదాలు జరిగితే గానీ పట్టించుకోరా...?



సంబేపల్లి, మే 02 ప్రభాతవార్త:

రాయచోటి కేంద్రంగా కడప చిత్తూరు జాతీయ రహదారిలో అటు కడప వైపు, ఇటు చిత్తూరు వైపు తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అయినప్పటికీ సంబంధిత అధికారుల పర్యవేక్షణ అంతంత మాత్రంగానే ఉంది. సంబేపల్లి మండల పరిధిలోని నారాయణరెడ్డి గారి పల్లి సచివాలయం సమీపంలో రోడ్డు ప్రక్కన తిరుపతిగ్రీన్ మార్క్ హాస్పిటల్ వారు నిర్మించిన భారీ కట్ అవుట్ బోర్డు రోడ్డు భాగం వైపు పడిపోయి ఉంది. ఎవరూ పట్టించుకోవడం లేదని పలువురు తెలుపుతున్నారు. భారీ కటౌట్ భారీ కట్ అవుట్ బోర్డు జాతీయ రహదారికి ఆనుకొని పడిపోవడంతో వచ్చిపోయే వాహనాలు ఇబ్బందిగా ఉంది. వాహన దారులు కూడా అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. గత మూడు రోజుల నుంచి బోర్డు పడిపోవడం చూస్తూనే ఉన్నామని ప్రతి రోజూ అటువైపు వాహనాలలో తిరిగే కొందరు, మరికొందరు స్థానిక ప్రజలు తెలుపుతున్నారు. మూడు రోజుల నుంచి జాతీయ రహదారిలో కటౌట్ పడిపోవడం, అధికారులు పట్టించుకోకపోవడం చూస్తుంటే ప్రమాదాలు జరిగితే గానీ పట్టించుకోరేమే అనే అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారి కావడంతో ప్రతి రోజూ ఎందరో అధికారులు, ప్రజాప్రతినిధులు అటు వైపు వెళ్తూనే ఉంటారు, పోలీసు, రవాణా అధికారుల దృష్టికి వెళ్లకుండా ఉంటుందా అని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని బారీ కటౌట్ ను వెంటనే తొలగించి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాల్సి న అవసరం ఎంతైనా ఉంది.

ఫోటో: జాతీయ రహదారి ప్రక్కన ప్రమాదకరంగా పడి వున్న భారీ కటౌట్

## సెక్షన్ 22ఏ కేసుల పరిష్కారంతో భూ హక్కులకు భరోసా

### జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్

మదనపల్లి, మే 2 ప్రభాత వార్త :

అన్నమయ్య జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సెక్షన్ 22ఏ కేసుల పరిష్కారంలో జిల్లా యంత్రాంగం విశేష పురోగతి సాధిస్తూ భూ హక్కులకు భరోసా నిస్తూ ప్రజలకు వేగవంతమైన సేవలు అందించే దిశగా సమర్థవంతంగా పనిచేస్తోందని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. గత ఆరు నెలల కాలంలో జిల్లా పరిపాలన చేపట్టిన ప్రత్యేక చర్యల ఫలితంగా భూసంబంధిత వివాదాల పరిష్కారంలో స్పష్టమైన ఫలితాలు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. జిల్లా స్థాయి కమిటీ ఆధ్వర్యంలో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తూ, ప్రతి దరఖాస్తును పూర్తిస్థాయిలో పరిశీలించి, సంబంధిత తహసీల్దార్లు, మండల వీఆర్వోలు, మండల సర్వేయర్లు హాజరై గ్రామ రికార్డులు, అసలు ఆధారాలను సమర్పించడం ద్వారా కేసులను నిష్పాక్షికంగా విచారిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి దరఖాస్తుదారునికి తమ వాదనలు వినిపించే అవకాశం కల్పిస్తూ, నిబంధనలకు లోబడి పూర్తి పారదర్శకతతో నిర్ణయాలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటివరకు మొత్తం 235 కేసులను విచారణకు తీసుకోగా, వాటిలో 159 కేసులను ఆమోదించి, 76 కేసులను తిరస్కరించినట్లు వెల్లడించారు. ఆమోదించబడిన కేసుల ద్వారా జిల్లాలో సుమారు 307.78 ఎకరాల భూములకు చట్టపరమైన స్పష్టత లభించినట్లు తెలిపారు. ఇది భూ పరిపాలనలో జిల్లా యంత్రాంగం కట్టుబాటును, సమర్థతను ప్రతిబింబిస్తోందన్నారు. మీసేవా గణాంకాల ప్రకారం జిల్లాలో మొత్తం



వన్ బి అడంగల్ అందజేస్తున్న కలెక్టర్

608 దరఖాస్తులు నమోదు కాగా, వాటిలో 235 కేసులు ఇప్పటికే పరిష్కరించబడ్డాయి. మిగిలిన 373 కేసులను, కూడా నిర్దేశిత కాలవ్యవధిలో పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. పాత దరఖాస్తుల్లో దాదాపు 40 శాతం పెండింగ్‌ను క్లియర్ చేశామని, తాజాగా మరో 57 కొత్త దరఖాస్తులు అందాయన్నారు. ప్రజలకు న్యాయం చేయడం, భూ వ్యవహారాల్లో పారదర్శకత తీసుకురావడం జిల్లా పరిపాలన ప్రధాన లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. భూమిపై హక్కు ప్రజలకు నమ్మకం,ఆ నమ్మకాన్ని నిలబెట్టడం పరిపాలన బాధ్యత" అన్నారు.

## శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నల్లారి

పీలేరు, మే 2 ప్రభాతవార్త:

పట్టణంలోని తిరుపతి రోడ్డు మార్గం చౌడేశ్వరి నగర్‌లో వెలసిన శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారి రెండు రోజుల ఉత్సవాల్లో శనివారం పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ "శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారి దీవెనలు పీలేరు నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలి. అమ్మవారి కృపతో అందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నాను. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని" పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ "రెండు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా రాగ దీపాలు, ఊంజల సేవ, అమ్మవారికి ప్రత్యేక అలంకరణతో పూజలు నిర్వహిస్తున్నాం. శనివారం రాత్రి అమ్మవారి గ్రామోత్సవం, ఊరేగింపు కార్యక్రమం ఉంటుంది. తిరుపతి రోడ్డు మార్గం నుండి ఆర్టీసీ బస్టాండ్



ప్రత్యేక పూజలు పాల్గొన్న ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి

వరకు అమ్మవారి ఊరేగింపు ఘనంగా నిర్వహిస్తామని"తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు







పీలేరు, కెవి పల్లె మే 2 ప్రభాతవార్త:

అన్నయ్య జిల్లా, ఉమ్మడి చిత్తూరు జిల్లా కంభం వారి పల్లికి చెందిన శ్రీ ఎం. హరి ప్రసాద్ రెడ్డి 1990 దశకంలో అమెరికాకు వెళ్లి అక్కడ ఐటీ సంస్థను స్థాపించి వ్యాపార రంగంలో విశేష విజయాలు సాధించారు. విదేశాలలో స్థిరపడ్డప్పటికీ, తన పుట్టిన నేలపై ఉన్న అనుబంధాన్ని ఎప్పుడూ మర్చిపోలేదు. ఆ భావంతోనే 2004లో "ఫ్రెండ్లీ వెల్ఫేర్ సర్వీసెస్" అనే స్వచ్ఛంద సేవా సంస్థను స్థాపించి, తెలుగు రాష్ట్రాల్లో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అనాథాశ్రమాలకు ఆర్థిక సహాయం, అవసరమైన వస్తువుల పంపిణీ, కర్నూలు వరదల సమయంలో బాధితులకు అండగా నిలవడం వంటి ఎన్నో సేవలను ఆయన అందించారు. వృద్ధులకు మాత్రమే కాకుండా, చిన్న వయసులోనే కంటి సమస్యలు ఎదుర్కొంటున్న వారికి కంటి అద్దాల పంపిణీ, గిరిజన ప్రాంతాల్లో వినికిడి పరికరాల పంపిణీ వంటి కార్యక్రమాలు చేపట్టారు. అంతేకాకుండా, తన సంస్థ ద్వారా గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణ అందించి, వారికి వసతి సౌకర్యాలు కల్పించి, ప్రోత్సాహక పారితోషకాలు ఇచ్చి, ఉపాధి అవకాశాలను కల్పించడంలో కీలక పాత్ర పోషించారు. కరోనా సమయంలో పారిశుధ్య కార్మికులు, హోమ్ గార్డులు మరియు పేదరికంతో బాధపడుతున్న గ్రామీణ ప్రజలకు కూడా సహాయం అందించారు. క్రీడల అభివృద్ధికి కూడా ఆయన మద్దతు ఇస్తున్నారు. ఇవన్నీ ఆయన నిరంతరం చేస్తూనే ఉన్న సేవలు. అయితే, ఇంతకు ముందెన్నడూ వినని ఒక గొప్ప సంకల్పంతో ఆయన ముందుకొచ్చారు. సమాజానికి నిస్వార్థంగా సేవలందించే వారే నిజమైన హీరోలు అన్న భావనతో, నిర్వి ఆర్ట్స్ ఆధ్వర్యంలో వసుధ ఫౌండేషన్ మరియు "NIRVI Awards - Top 100 Social Heroes" కార్యక్రమాన్ని నిర్వహించారు. సమాజ సేవలో విశేష కృషి చేసిన 100 మంది సేవకులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి సన్మానించడం ద్వారా ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు వ్యాపార





దిగ్గజాలు, న్యాయమూర్తులు, ఉన్నతాధికారులు, సినీ ప్రముఖులు తదితరులు హాజరై మరింత ప్రతిష్ఠను తీసుకువచ్చారు. సమాజ సేవకులను గుర్తించి గౌరవించడం మన బాధ్యత అనే సందేశాన్ని ఆయన స్పష్టంగా తెలియజేశారు. లలిత కళలు, సాహిత్యం, జానపదం, ప్రాచీన కళలకు ప్రాధాన్యతనిస్తూ, వివిధ రంగాల్లో ప్రతిభ కలిగిన వారిని వెలుగులోకి తీసుకురావాలనే లక్ష్యంతో నిర్వి ఫోక్ అవార్డ్స్, నిర్వి ఫిలిం డెబ్యూ అవార్డ్స్ వంటి కార్యక్రమాలను కూడా చేపట్టాలని సంకల్పించారు. ధర్మం పట్ల నిబద్ధత, దేశం పట్ల ప్రేమ ఆయన వ్యక్తిత్వంలో స్పష్టంగా కనిపిస్తాయి. ప్రతి సంవత్సరం మొలకల పౌర్ణమి జాతరలో అన్నదానం నిర్వహించడం, శ్రీరామ నవమి సందర్భంగా రాముల వారి కళ్యాణం జరిపించడం ద్వారా గ్రామ ప్రజల్లో ఆధ్యాత్మిక భావనను పెంపొందిస్తున్నా రు. అదేవిధంగా, రామాయణం, భాగవతం వంటి ధార్మిక గ్రంథాలతో పాటు సుమతి శతకం పుస్తకాలను వందల సంఖ్యలో పంపిణీ చేసి, నైతిక విలువలను సమాజంలో బలపరిచేందుకు కృషి చేస్తున్నారు. ఇలాంటి సేవలను నిరంతరం కొనసాగిస్తున్న చిత్తూరు జిల్లా పౌరుడు, తెలుగు తేజంగా నిలుస్తున్న హరి ప్రసాద్ రెడ్డి గారు మన ప్రాంతానికి చెందినవారవడం మనందరికీ గర్వకారణం.

## పరిమళించిన మానవత్వం-మహిళకు అందిన వైద్యం...!

చౌడేపల్లి, మే 2 ప్రభాతవార్త

ఆసుపత్రికి వస్తే కానీ సేవందించని వైద్య సిబ్బందిని మనం చూస్తున్నాం...ఎక్కడైనా ప్రమాదం సంభవిస్తే తమ పరిధి కాదని కొందరు చేతులెత్తేస్తుంటారు...అయితే సేవలకు ఎల్లలు లేవంటూ ఎఎన్ఎం ప్రసవ వేదన పడుతున్న యానాది మహిళను అక్కున చేర్చుకొని వైద్యమందించి మానవత్వాన్ని చాటుకొన్న సంఘటన చౌడేపల్లిలో చోటు చేసుకొంది. మండలంలోని గడ్డంవారిపల్లి రహదారి యానాదిండ్లకు చెందిన వసంత గర్భం దాల్చింది. ఈ క్రమంలో చౌడేపల్లి పరిధిలోని చిన్నకొండామర్రి హెబ్బి నాయనమిట్టలోని మామిడి తోటలో కాపలాకు ఒప్పందం కుదుర్చుకొని వసంత ఆమె కుటుంబ సభ్యులు అక్కడే వున్నారు. అయితే వసంతకు రాత్రి పురిటి నొప్పులు వచ్చాయి. దీంతో యానాదులు దిక్కుతోచక అక్కడే ఆమెకు కాన్పుచేసారు. పండంటి మగశిశువుకు జన్మనిచ్చిన వసంత ఆ తర్వాత తీవ్ర అస్వస్థతకు గురైంది. విషయం ఆనోట ఈనోట పడి చౌడేపల్లి పట్టణంలోని ఆశా కార్యకర్తలు రాధ, అనితలకు తెలిసింది. వెంటనే ఎఎన్ ఎం రుక్మిణికి సమాచారమందించారు. స్పందించిన ఆమె 108వాహన సేవ ల ద్వారా తల్లీబిడ్డలను ఆరోగ్య కేంద్రానికి తరలించుకొని వచ్చారు. గర్భస్త శిశువుకు సపరియలు చేసి, తల్లి వసంతకు వైద్య సేవలందించారు. దీనివల్ల ఇరువురూ సురక్షితంగా బయటపడ్డారు. విషయం తెలుసుకొన్న వెంటనే మాతాశిశువులను అక్కున చేర్చుకొని సేవలందించిన ముగ్గురినీ వైద్యాధికారి మోనా, స్థానికులు అభినందనలు తెలిపారు.



యానాది మహిళలకు సపరియలు చేస్తున్న రుక్మిణి

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

### ఒకరికి తీవ్ర గాయాలు


పీలేరు మే 2 ప్రభాతవార్త:

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం పీలేరు మండలంలో చోటుచేసుకుంది. ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. చిత్తూరు జిల్లా సదుం మండలం బూరగమందకు చెందిన పాపయ్య అలియాస్ నాని 35 తన భార్య సునీత పీలేరు మండలం ఇందిరమ్మ కాలనీలో ఉండగా అక్కడికి వచ్చాడు ఇంట్లో మాంసం తీసుకురమ్మని చెప్పడంతో తన భార్య తమ్ముడు ధను 15 కలిసి ద్విచక్ర వాహనంలో చిత్తూరు మార్గం వైపు వెళ్ళాడు అక్కడ మాంసం తీసుకుని తిరుగు ప్రయాణం అయ్యారు. ఈ క్రమంలో ఎం జె ఆర్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద వెనుక నుండి వచ్చిన గుర్తు తెలియని వాహనం వీరిని ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ధను అక్కడికక్కడే మృతి చెందగా నాని తీవ్ర గాయం పడ్డాడు గాయపడ్డ నానిని చికిత్స నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు ఈ మేరకు కేసు నమోదు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ మనీ తెలిపారు.



తీరంగా గాయపడిన పాపయ్య

## వైష్ణవి సన్మానించిన పీలేరు ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి




విద్యార్థిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

పీలేరు మే 2 ప్రభాతవార్త:

పీలేరు బాలికల ఉన్నత పాఠశాలలో పదవ తరగతి ఫలితాల్లో వైష్ణవి 600 కి 595 మార్కులు సాధించిన విద్యార్థి వైష్ణవి ని . పీలేరు శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి కలికిరి లో దుశ్యాలువతో సన్మానించి మెమెంటో ను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థిని యొక్క పట్టుదల కృషి తల్లిదండ్రుల యొక్క ప్రోత్సాహంతో రాష్టస్థాయిలో రెండవ స్థానం సాధించింది అని కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థిని ఈ ఘనత సాధించడం మనకు ఎంతో గర్వకారణం అని కొనియాడారు. గవర్నమెంట్ పాఠశాలలో మెరుగైన వసతులు కలవని నైపుణ్యం గల ఉపాధ్యాయులు కలరని మెరుగైన విద్య భోధన ఉంటుంది అని ప్రతి తల్లి, తండ్రి తమ పిల్లలని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి ని తల్లీ తండ్రులు మునిరాజా శైలజ జిల్లా దీదినితీ కార్యదర్శి తాటిపర్తి గంగాధరం మదనపల్లి ఉప విద్య శాఖ అధికారి లోకేశ్వర్ రెడ్డి పీలేరు మండల విద్యాశాఖ అధికారిని పద్మావతి పాఠ శాల ప్రధానోపాధ్యాయులు రెడ్డెప్పరెడ్డి, పలవల బాబురెడ్డి పాల్గొన్నారు.

## మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ సీఎం నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి




పీలేరు, మే 2 ప్రభాతవార్త :

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి, పీలేరు నియోజకవర్గ శాసన సభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి శనివారం కలికిరి మండలంలో పలువురి కుటుంబాలను పరామర్శించారు. కలికిరి మండలం గుట్టపాలెం పంచాయతీ వాడ వాండ్లపల్లికి చెందిన కృష్ణా రెడ్డి ఇటీవల మరణించడంతో నల్లారి సోదరులు వారి నివాసానికి వెళ్లి మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. అనంతరం కలికిరి పట్టణానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు వేంపల్లి అబ్దుల్ ఖాదర్ సతీమణి ఇటీవల మరణించడంతో వారి ఇంటికి వెళ్లి అబ్దుల్ ఖాదర్‌ను, కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ పరామర్శలో నల్లారి సోదరుల వెంట కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్ర టీడీపీ క్లస్టర్ సమావేశంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

కలికిరి, మే 2, ప్రభాతవార్త:

జాతీయ తెదేపా కార్యాలయంలో జరుగుతున్న 17వ రాష్ట్ర క్లస్టర్, కో క్లస్టర్ శిక్షణా తరగతుల్లో కలికిరి మండలం తెదేపా మైనార్టీ నాయకులు మున్వర్ అలీ, కేవీ పల్లి మండలం తెదేపా నాయకులు శివారెడ్డిలు హాజరయ్యారు. అనంతరం రాష్ట్ర మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వర రావును కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులో తెదేపా బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై తెదేపా అధిష్టానం శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.



## ఎన్టీఆర్ వైద్య సేవలపై పర్యవేక్షణ

డాక్టర్ లోకవర్ధన్

పీలేరు మే 2 ప్రభాతవార్త:

పీలేరు ఎస్ కె ఆర్ హాస్పిటల్ నందు ఎన్.టి.ఆర్ వైద్య సేవ ట్రస్ట్ నిర్వహణ తీరును పర్యవేక్షిస్తున్న అన్నమయ్య జిల్లా ఎన్.టి.ఆర్ వైద్య సేవ ట్రస్ట్ పర్యవేక్షణ అధికారి డాక్టర్ లోకవర్ధన్ ట్రస్ట్ సిబ్బం దితో మాట్లాడుతూ ట్రస్ట్ యొక్క నియమ నిబంధనల మేరకు రోగులకు అవసర మైన సేవలను కాలయాపన లేకుండా అందించాలని ఆదేశించారు. రోగులకు హాస్పిటల్స్ కు మధ్య ఆరోగ్య మిత్ర పని తీరు చాలా కీలకం అని అన్నారు. ట్రస్టు సేవలకు అవసరమైన అర్హతలు గల రోగులనుండి ఎలాంటి లావాదేవీలు నిర్వ హించరాదని అన్నారు. ఎన్ టి ఆర్ వైద్య సేవ ట్రస్ట్ ద్వారా అర్హులైన రోగులకు తృప్తికరమైన వైద్య సేవలు అందించడానికి ముందుండాలని అన్నారు. అనంత రం మార్కెట్ యార్డులో 104 అంబులెన్స్‌ల పనితీరును తనిఖీ చేశారు.




## పీలేరులో అంబేద్కర్ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయండి

పీలేరు మే 2 ప్రభాతవార్త:

పీలేరు పట్టణంలో విద్యార్థుల అభివృద్ధి మరియు యువతకు మెరుగైన మార్గదర్శనం కల్పించేందుకు అంబేద్కర్ స్టడీ సర్కిల్‌ను మంజూరు చేయాలని డివిఎంసీ సభ్యుడు బోధిషా వలి అన్నమయ్య జిల్లా కలెక్టర్ గారిని వినతిపత్రం ద్వారా కోరారు. ఈ సందర్భంగా బోధిషా వలి మాట్లాడుతూ, పీలేరు ప్రాంతంలో ఉన్న విద్యార్థులకు పోటీ పరీక్షల సిద్ధత, సామాజిక అవగాహన, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలలో సరైన మార్గదర్శనం అవసరం ఎంతో ఉందని తెలిపారు. ప్రస్తుతం సరైన వనరులు, శిక్షణా కేంద్రాలు లేక చాలా మంది విద్యార్థులు పోటీ పరీక్షల్లో వెనుకబడుతున్నారని పేర్కొన్నారు. అంబేద్కర్ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేస్తే గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన అధ్యయన వాతావరణం, పుస్తకాలు, శిక్షణా కార్యక్రమాలు అందుబాటులోకి వస్తాయని, దీని ద్వారా వారి భవిష్యత్తుకు బలమైన పునాది పడుతుందని ఆయన అన్నారు. అందువల్ల, పీలేరు పట్టణంలో అంబేద్కర్ స్టడీ సర్కిల్‌ను తక్షణమే మంజూరు చేసి, అవసరమైన సౌకర్యాలు కల్పించాలని బోధిషా వలి కలెక్టర్ గారిని కోరారు.



బోదేశావలి

# ప్రజాదర్బార్‌లో ప్రజా సమస్యల పరిష్కారం : రితీష్‌రెడ్డి

**బద్వేలు మే 2, ప్రభాతవార్త :**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా దర్బార్ ప్రజా సమస్యలు తెలుసుకోవడమే ప్రధాన లక్ష్యమని టిడిపి ఇన్చార్జ్ రితీష్‌రెడ్డి అన్నారు. శనివారం బద్వేల్ పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో బద్వేల్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ రితీష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుండి వచ్చిన వినతులను ఆయన స్వయంగా స్వీకరించి, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, ప్రజల సమస్యలపై అలసత్వం ప్రదర్శించకుండా తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. నియోజకవర్గంలో అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వాటిని పరిష్కరించడమే ధ్యేయంగా ప్రభుత్వ పని చేస్తుందని అన్నారు. పరిష్కారం సమస్యలను కూడా త్వరగా పరిష్కరించడమే ధ్యేయంగా దృష్టి పెడుతున్నామన్నారు. ప్రజలు అధికారుల దగ్గరికి వెళ్లిన కొన్ని పరిష్కారం కానీ సమస్యలపై వెంటనే అధికారులతో చర్చించి ప్రజా సమస్యలు త్వరగా పరిష్కరించాలని వారి సూచించడం జరుగుతుంది. ముఖ్యమంత్రి చేపట్టిన ఈ



ప్రజాధర్బార్ ఏ ఒక్కరు నిరాశ చెందకూడదని అధికారులను కోరుచున్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని, అందుకే ఇలాంటి ప్రజాదర్బార్ కార్యక్రమాలను ప్రారంభించామని రితీష్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చేనేత క్లస్టర్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్

**సిద్ధవటం మే 2 ప్రభాతవార్త**

సిద్ధవటం మండలంలోని మాధవరం1 గ్రామ పంచాయతీలోని ఎస్.కే.ఆర్ నగర్ లో శనివారం చేనేత క్లస్టర్ భవనాన్ని జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పరిశీలించి నేతన్న సమస్యలపై వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ చేనేత క్లస్టర్ ను సందర్శించి ఫ్యాషన్ డిజైను ఎలా చేస్తారని చేనేతలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఒరిజినల్ మగ్గాలపై క్లాత్ తయారు చేసుకొని డిజైన్ చేయించి ఇక్కడి నుండి ఇతర దేశాలకు ఎగుమతులు చేస్తామని వారు వివరించారు. ఫ్యాషన్ డిజైన్ల కోసం 2 నెలల్లో మిషన్లు తెప్పిస్తామన్నారు. అనంతరం డయింగ్ హౌస్ ను పరిశీలించి డయింగ్ హాల్ ను మరమత్తులు చేయించేందుకు ప్రతిపాదనలు పంపాలని అధికారులకు సూచించారు. డయింగ్ హౌస్ వెనుక భాగమున ఖాళీ స్థలంలో భవన నిర్మాణము మగ్గాల మిషన్ల ఏర్పాటు చేసేందుకు అంచనాలు ఇవ్వాలని తెలిపారు. అంతేకాకుండా క్లస్టర్ అభివృద్ధి కొరకు ఒక కమిటీని ఏర్పాటు చేసి విధి విధాలను రూపొందించాలని తెలిపారు. చేనేత క్లస్టర్ భవనానికి సంబంధించిన స్థలాన్ని సరిహద్దులు ఏర్పాటు చేయాలని చేనేత కార్మికులు కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం మాధవరం ప్రాథమిక వైద్యశాల పక్కన ఉన్న ప్రభుత్వ స్థలంలో నేనేత క్లస్టర్ కు సంబంధించి సేల్స్ భవనాన్ని ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు చేస్తే అభివృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్లూమ్ ఏడీ పిచ్చేశ్వరరావు డి.ఆర్.డి.ఎ పిడీ రాజ్యలక్ష్మి, హౌసింగ్ పిడీ రాజారత్నం, ఏడిఏ లు రవి ప్రకాష్ రెడ్డి, కేశగిరిరావు, మండల ప్రత్యేక అధికారి జయసింహ, తహసిల్దార్ తిరుమల బాబు, రెవిన్యూ ఇన్స్పెక్టర్ ప్రసాద్, క్లస్టర్ భవనం గుత్తేదారుడు శ్రీకాంత్, చేనేత సొసైటీ అధ్యక్షులు శ్రీరామదాసు వెంకట్, చైర్మన్ గంజి సుబ్బరాయుడు, మాజీ సర్పంచ్ జానకి రామయ్య, సొసైటీ అధ్యక్షులు మునగపాటి సుబ్బరాయుడు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీ నరసయ్య, వీఆర్వోలు, శివశంకర్, కేశవులు, చేనేత కార్మికులు రవిశంకర్, రామకృష్ణ, సామ శ్రీనివాసులు, మామిళ్ళ శ్రీహరి, బోడిచెర్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



# విజేతలకు బహుమతులు ప్రధానం



**కడప కార్పొరేషన్ మే02 ప్రభాతవార్త:**

శనివారం కడప హౌసింగ్ బోర్డ్ కోదండ రామాలయంలో తెలుగు పద కవితా పితామహుడు వాగ్గేయకారుడు శ్రీతాళ్లపాక అన్నమాచార్యుల వారి 618 వ జయంతినీ ఘనంగా నిర్వహించినట్లు ఆలయ సేవా సమితి నిర్వాహకులు వెంకటరెడ్డి తెలిపారు. విజేతలకు బహుమతిలు ప్రధానం చేశారు. ఉ. 9.00 గంటలకు మాడవీధులలో నగర సంకీర్తన, 9:30 గం.లకు జ్యోతి ప్రజ్వలన అనంతరం అతిథుల సందేశం,10:30 గంటలకు అన్నమాచార్యుల సప్తగిరి సంకీర్తనల గోష్ఠిగానం పోటీలు నిర్వహించారు. అన్నమయ్య సంకీర్తనల పోటీలలో ప్రథమ బహుమతి తన్మయి, ద్వితీయ బహుమతి రఘునాథ్ రెడ్డి, తృతీయ బహుమతి విజేత నాగాంజన్ లను కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు.

## పాత సంగటిపల్లిలో బండలాగుడు

**పెండ్లిమర్రి, మే 2, ప్రభాతవార్త:**

మండలంలోని పాత సంగటిపల్లెలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం బండలాగుడు పోటీలను పుత్తా నరసింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చంద్ర, చంద్ర ఓబుల్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు సురేంద్రనాథ్‌రెడ్డి, చెంద్రాయుడు తదితరులు పాల్గొన్నారు.



# వైభవంగా గ్రామోత్సవం



**రాజుపాళెం, మే 2, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని కొర్రపాడు గ్రామంలో శనివారం శివాలయం విగ్రహ ప్రతిష్ట గ్రామోత్సవం వైభవంగా భక్తిశ్రద్ధలతో జరిగినది. ఆలయంలో విగ్రహ ప్రతిష్ట చేయు దక్షిణామూర్తి, లింగోద్భవ మూర్తి, చండీశ్వర, నాగదేవత, నూతన శిఖరం ఊరేగింపు కార్యక్రమం గ్రామంలో ఎంతో వైభవంగా సాగినది. ఈ గ్రామోత్సవ కార్యక్రమంలో చెక్కభజన, కోలాటం, మహాకాళి అఘోరీ ప్రదర్శన, డప్పు కళాకారుల ప్రదర్శనలు, విన్యాసాలు ఎంతగానో అలరించినవి. శివాలయంలో స్వామి వారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆగమ శాస్త్రానుసారం వేద పండితుల ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు హోమం ఆరాధన వంటి ప్రత్యేక పూజలు జరిగినవి. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ

**బద్వేల్ మే 2, (ప్రభాతవార్త ):**

ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు ఒక వరమని బద్వేల్ టిడిపి ఇన్చార్జి నితీష్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి సహాయ ని కింద వచ్చిన చెక్కులను శనివారం పార్టీ కార్యాలయంలో బాధితులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మొత్తం 26 మంది లబ్ధిదారులకు రూ.11,30,997 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎంఆర్ఎఫ్ ద్వారా ప్రజలకు ఆర్థిక సహాయం అందిస్తూ ఆదుకుంటున్నారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతూ అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తోందని పేర్కొన్నారు.



## శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రమోత్సవములు

**గోపవరం. మే 2. ప్రభాతవార్త.**



మండలం వల్లేరవారి పల్లె గ్రామం లో వెలసిన స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నందు వైశాఖ,మాసం ప్రారంభంతో మూడవ శనివారం సందర్భంగా వైభవంగా అభిషేకం పూజా కార్యక్రమం నిర్వహించడం జరిగినది, తదుపరి స్వామి అమ్మవారు ప్రత్యేక అలంకరణ పలు రకాల పుష్పలాతో ప్రత్యేక అలంకరణలో స్వామి అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు, తదుపరి ఆలయ నిర్వహకులు గ్రామ పెద్దలు, యువకులు మాట్లాడుతూ 8 వ తేదీన ధ్వజారోహం,గణపతి పూజ, నవగ్రహ శాంతి హోమం,నరసింహ స్వామి హోమం,వేద ఆశీర్వాదం అన్న ప్రసాద కార్యక్రమం,9వ తేదీన పలు రకాల పండ్ల రస ద్రవాల్లతో అభిషేకం,రాహు కాల హోమం, స్వామి వారి తిరు కళ్యాణం,అన్న ప్రసాద కార్యక్రమం,చాందిని బండ్ల ఉత్సవం, గ్రామ్మోత్సవం,10 వ తేది న సహస్రనామం పూజ,పులంగి సేవ,అన్న ప్రసాద కార్యక్రమం బండ్ల ఎద్దుల పోటీలు అని తెలిపారు, ప్రతి ఒకరు సకుటుంబ సమేతగముగా స్వామి వారి పూజ,తిరు కళ్యాణం ను తిలకించి స్వామి వారి కళ్యాణ తాంబూలం, సంపూర్ణ ఆశీర్వాదం పొదగలరు అని ఆలయ నిర్వహకులు తెలిపారు, తదుపరి స్వామి వారిని దర్శించడం కోసం వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందించడం జరిగినది,అన్నదాన కైంకర్యం నిర్వహించినవారు పోలు. రమణయ్య ధర్మపత్ని కుమారి నిర్వహించారు ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా భువనగిరిపల్లె లక్ష్మీనరసింహస్వామి కళ్యాణం



కళ్యాణోత్సవంలో మంగళసూత్రాన్ని చూపుతున్న అర్చకులు కృష్ణస్వామి



స్వామిని దర్శించుకున్న టిడిపి అసెంబ్లీ జగన్ మోహన్ రాజు



కళ్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

**రాజంపేట, మే 2 ప్రభాతవార్త**

కడప రేణిగుంట జాతీయ రహదారి పక్కనే భువనగిరి కొండపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి కళ్యాణోత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. కళ్యాణోత్సవానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. గోవింద నామస్మరణతో స్వామి కళ్యాణోత్సవం వైభవంగా జరిగింది. అడుగడుగునా భక్తులు భక్తి భావంతో కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. కళ్యాణ క్రతువును ఆలయ అర్చకులు కృష్ణస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. వేదమంత్రాలతో, శాస్త్రోక్తంగా స్వామి కళ్యాణాన్ని నిర్వహించారు. కళ్యాణ మంగళసూత్రాన్ని భక్తులకు చూపినప్పుడు మహిళలు గోవిందా అంటూ భక్తి పారవశంతో నమస్కరించి జేజేలు పలికారు. అనంతరం జరిగిన ముత్యాల తలంబ్రాల వేడుకలు వైభవంగా సాంప్రదాయ బద్దంగా జరిగాయి. తలంబ్రాల వేడుకలు అనంతరం జరిగిన చదివింపుల కార్యక్రమంలో భక్తులు వేలాదిగా స్వామికి తమ ముడుపులు చెల్లించి మొక్కుబడి తీర్చుకున్నారు. అంతకుముందు సాంప్రదాయంగా మాజీ మంత్రి పసుపులేటి బ్రహ్మయ్య తనయుడు పవన్,ప్రదీప్ లు కుటుంబ సభ్యులతో కలిసి లక్ష్మీనరసింహస్వామికి ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించారు. అలాగే తెలుగుదేశం పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్ చమర్తి జగన్మోహన్రాజు స్వామికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తల మండల సభ్యులు బ్రహ్మయ్య కుటుంబ సభ్యులకు జగన్మోహన్ రాజుకు పూర్ణకుంభ స్వాగతంతో ఆలయం మర్యాదలతో స్వాగతం పలికి సత్కరించారు. కళ్యాణోత్సవం అనంతరం వేలాదిగా తరలివచ్చిన భక్తులకు ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు పూల హరిప్రసాద్ ,కావేటి గారి వెంకటరమణ, కేవీస్ నరసింహ ,మన్నేరు లక్ష్మీ నరసయ్య, నామాల రాజశేఖర్, కంబాయి గారి సుబ్బ నరసింహులు, కొమ్మూరు సుబ్బ నరసయ్య పాల్గొన్నారు.

## శ్రీవారి భక్తుల కోసం “రఘురామ నిలయం“ ప్రారంభం



రఘురామ నిలయం ప్రారంభిస్తున్న ఎంపీ మేడా రఘునాథరెడ్డి

**రాజంపేట, మే 2 ప్రభాతవార్త**

కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి నిలయమైన పవిత్ర తిరుమల క్షేత్రంలో శ్రీవారి భక్తుల కోసం అధునాతన వసతులతో నిర్మించిన రఘురామ నిలయాన్ని“రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి, రాజంపేట మాజీ శాసనసభ్యులు, టీటీడీ మాజీ బోర్డు మెంబర్ మేడా వెంకట మల్లిఖార్జున రెడ్డి, ఎం.ఆర్.కె.ఆర్ కన్స్ట్రక్షన్స్ ఎం.డీ మేడా మధుసూదన్ రెడ్డిలు ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎం.పీ మేడా రఘునాథ రెడ్డితో పాటు, టీటీడీ అదనపు ఈఓ వెంకయ్య చౌదరి, తిరుపతి పార్లమెంట్ సభ్యులు ఎంపీ మద్దెల గురుమూర్తి, తెలంగాణ పార్లమెంట్ సభ్యులు బలరాం నాయక్, నందలూరు ఎంపీపీ మేడా విజయ భాస్కర్ రెడ్డిలు పూజలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రారంభోత్సవానికి విచ్చేసిన అతిథులు మాట్లాడుతూ శ్రీవారి భక్తులకు మరింత సౌకర్యం కల్పించే సేవా కేంద్రంగా రఘురామ నిలయాన్ని నిర్మించడం సంతోషం అని హర్షం వ్యక్తం చేస్తూ మేడా కుటుంబ సేవలను కొనియాడారు.

# గౌతమి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో హాకథాన్

**ప్రొద్దుటూరు మే 2 ప్రభాతవార్త**

మండల పరిధిలోని గౌతమి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థుల సృజనాత్మకత సాంకేతిక నైపుణ్యాలు మరియు ఆవిష్కరణత్మక ఆలోచనలను ప్రోత్సహించేందుకు నాలుగు రోజులపాటు బూట్ క్యాంపు మరియు అనంతరం హాకథాన్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. ఈ కార్యక్రమం వైబ్ కోడింగ్ అంశంపై నిర్వహంచబడిందని బూట్ క్యాంపు విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలు ప్రోగ్రామింగ్ పుణ్యాలు సమస్య పరిష్కార విధానాలు మరియు టీం వర్స్ ప్రాక్టికల్ శిక్షణ అందించబడిందని తెలిపారు నిపుణులచే నిర్వహించిన సెషన్లు విద్యార్థులకు పరిశ్రమలు అవసరమైన నైపుణ్యాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు అనంతరం నిర్వహించిన రెండు రోజుల హాక్థాన్ లో విద్యార్థులు గట్టుగా విభజించబడి రియల్ టైం సమస్యలకు సృజనాత్మక పరిష్కారాలను రూపొందించినట్లు తెలిపారు వారు అభివృద్ధి చేసిన ప్రాజెక్టులు నూతన ఆలోచనలు సాంకేతిక ప్రావీణ్యం మరియు సమయపాలనను ప్రతిబింబించాయని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో విద్యార్థులలో ఇన్నోవేషన్ స్ఫూర్తి పెంపొందించి ప్రాక్టికల్ లర్నింగ్ ప్రాధాన్యం ఇవ్వబడి టీం వర్క్ మరియు లీడర్షిప్ లక్షణాలు అభివృద్ధి చెందినట్లు పేర్కొన్నారు కార్యక్రమం ముగింపు సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం రామసుబ్బమ్మ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులు బలమైన పునాది వేస్తాయని పేర్కొన్నారు ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో కరస్పాండెంట్ బాబమ్మ చైర్మన్లు సి నాగూర్ బి రవీంద్రారెడ్డి డైరెక్టర్ శైలుషలు మార్గదర్శకత్వం అందించారు ఉత్తమ ప్రదర్శన చేసిన జట్లకు బహుమతులు మరియు రసం శాపత్రాలు అందజేసినట్లు తెలిపారు ఈ కార్యక్రమం విద్యార్థులలో నూతన ఆలోచనలు ప్రేరేపిస్తూ వారిని పరిశ్రమకు సిద్ధం చేసే దిశగా నిలిచిందన్నారు.




## పులివెందులలో రేపు ‘చల్ల’ కార్యక్రమం

**పులివెందుల, మే 2, ప్రభాత వార్త :**

పులివెందుల పట్టణంలో ఆదివారం నిర్వహించే చల్ల కార్యక్రమం సందర్భంగా ఎక్కడా జంతుబలి నిర్వహించరాదని దేవర కమిటీ పట్టణ ప్రజలకు విజ్ఞప్తి చేసింది. పట్టణంలో అమ్మవార్ల ఆలయాలు అధికంగా ఉన్న నేపథ్యంలో అమ్మవారిని శాంతపర చేందుకు చల్ల బోనాలు సమర్పించాలని నిర్ణయించినట్లు తెలిపింది.ఆదివారం ఉదయం 6 గంటలకు స్థానిక శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం వద్ద భక్తులు చల్ల బోనాలతో చేరుకోవాలని కోరారు. అక్కడి నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లి వివిధ అమ్మవార్లకు చల్ల బోనాలు సమర్పించనున్నట్లు పేర్కొన్నారు.చల్ల కార్యక్రమం జరిగే రోజు పట్టణంలో ఎటువంటి జంతుబలి చేయరాదని, అలాగే మాంసాహార విక్రయాలు కూడా నిలిపివేయాలని దేవర కమిటీ విజ్ఞప్తి చేసింది. మాంసం విక్రయించే దుకాణాలు స్వచ్ఛందంగా మూసివేయాలని కోరింది. ఇక చల్ల బోనం తయారీకి కొత్త మట్టి కుండను తీసుకుని శుభ్రపరిచి, ఉప్పు లేకుండా అన్నం వండి చల్లార్చిన తర్వాత పెరుగుతో కలపాలని తెలిపారు. కుండకు పసుపు, కుంకుమతో అలంకరించి, తమలపాకులు, వేపమండ, పూలతో అలంకరించి అమ్మవారికి సమర్పించే విధంగా సిద్ధం చేయాలని నిర్వాహకులు వివరించారు.

# ప్రజలను రెచ్చగొట్టే పద్ధతి వద్దు

**ప్రొద్దుటూరు క్రైం, మే 2, ప్రభాతవార్త:**

రెచ్చగొట్టే ధోరణిలో మాట్లాడే వారి వీడియోలను సోషల్ మీడియా ద్వారా తీసుకెళ్లి అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తున్న వారిపై కఠిన చర్యలు తప్పవని వన్ టౌన్ సీఐ కొండారెడ్డి హెచ్చరించారు. శనివారం ఆయన యూ ట్యూబ్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ప్రసంగించారు. మనం ప్రసారం చేసే వార్తల వల్ల ఎలాంటి దుష్పరిణామాలు జరిగినా బాధ్యులు మీరే అని తెలిపారు. స్థాయి లేకుండా కొందరు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్న ప్రసారాలను కూడా ప్రసారం చేయడం వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందన్నారు. ఏఎస్పీ సూచనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యూ ట్యూబ్, సోషల్ మీడియాలలో ప్రసారాలు శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## ఎస్.ఎల్.వి.ఎం విద్యార్థుల ప్రభంజనం

**బద్వేల్ అర్బన్, మే 02 (ప్రభాత వార్త):**

2026 విద్యా సంవత్సరం పదవ తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాలలో బద్వేల్ పట్టణంలోని శ్రీ లక్ష్మీ విద్యారణ్య మహర్షి (ఎస్.ఎల్.వి.యం) ఉన్నత పాఠశాల విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరిచి ప్రభంజనం సృష్టించారు. పాఠశాలకు చెందిన బి.వి. జయంత్ శ్రావణ్ 593 మార్కులు సాధించి పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానంతో పాటు, పట్టణ స్థాయిలో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. అలాగే ఎన్. సరిత 581 మార్కులతో ద్వితీయ స్థానాన్ని, పి. శ్రీలక్ష్మి 570 మార్కులతో తృతీయ స్థానాన్ని పొంది పాఠశాల కీర్తిని చాటారు. మొత్తం 44మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా, వారిలో 24 మంది 500కు పైగా మార్కులు సాధించడం విశేషం. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గాజులపల్లి శంకర్ రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఆయన మాట్లాడుతూ “విద్యార్థుల క్రమశిక్షణ, ఉపాధ్యాయుల నిరంతర పర్యవేక్షణ మరియు ప్రణాళికాబద్ధమైన బోధన వల్లే ఈ అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయి. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, వారిలోని నైపుణ్యాలను వెలికితీసేలా మేము అందిస్తున్న నాణ్యమైన విద్యకు ఈ ఫలితాలే నిదర్శనమన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో పాఠశాల మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహిస్తుందని ఆశిస్తున్నాను. ఈ విజయంలో కీలక పాత్ర పోషించిన ఉపాధ్యాయ బృందాన్ని ఆయన కొనియాడారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జ్ సుభాషిణి, ఉపాధ్యాయులు యు.వి. సురేష్ బాబు, లక్ష్మీదేవి, బాల గురవయ్య, నరసింహులు, మల్లికార్జున, సుధా, సూర్య తదితరులు పాల్గొన్నారు.





## జిల్లెల్ల ఫీల్డ్ అసిస్టెంట్ పై ఫిర్యాదు

**దువ్వూరు, మే 02, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని జిల్లెల్ల గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ పై ఆ ప్రాంతంలోని ఉపాధి శ్రామికులు, ఉద్యానవన పంటలు సాగు చేసిన రైతులు ఫిర్యాదు చేశారు. ఉపాధి హామీ పథకంలో జిల్లెల్ల గ్రామ పంచాయతీకి వ్యక్తి ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఉపాధి హామీ పథకం ద్వారా నిమ్మ చెట్లు సాగుచేసిన తమకు రావలసిన బిల్లులు ఇవ్వడం లేదని అలాగే ఉపాధి హామీ శ్రామికులకు అందాల్సిన వారపు బిల్లులలో ప్రతి శ్రామికుని నుండి ఒక డిమాండ్ చేస్తున్నాడని ఏపీఓ లక్ష్మీ నారాయణ దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ విషయాన్ని రాత పూర్వకంగా రాసి ఇస్తే దీనిపై విచారణ జరుపుతామని పేర్కొన్నారు. నిమ్మ చెట్లు సాగుచేసిన రైతులకు అలాగే ఉపాధి హామీ శ్రామికులకు న్యాయం చేయాలని వారు ఆ వినతిపత్రంలో కోరారు.

## మురికి కాలువకు మోక్షం లేదా

**దువ్వూరు, మే 02, ప్రభాతవార్త:**



మండల కేంద్రమైన దువ్వూరులో పోలీస్ స్టేషన్ నుండి కాళికా మాత దేవాలయం వరకు రోడ్డుపై ప్రవహిస్తున్న మురికి నీరుకు మోక్షం లేదా అని దువ్వూరు ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గత మూడు సంవత్సరాలుగా మండల కేంద్రమైన దువ్వూరులోని మురికి నీరంత పోలీస్ స్టేషన్ వరకు కాలువలో వెళ్లి అక్కడ నుండి రోడ్డుపై ప్రవహిస్తుంది. దీంతో కాలినడకన నడిచే వారు, మోటార్ సైకిల్ పై వెళ్లేవారు, ఇతర వాహనాల వారు ఇబ్బందులు పడుతున్నారు. కాలినడకన పోయే వారికైతే మురికి నీరు బట్టల మీద పడి మురికిమయంగా మారుతున్నారు. దీనికి ప్రజలు అసహ్యించుకుంటున్నారు. గత మూడు సంవత్సరాలుగా అధికారులకు వినతి పత్రాలు ఇవ్వడమే తప్ప దీనికి ఎటువంటి పరిష్కారం ఇవ్వలేదు. వేసవి కాలమైన ఈ మురికి కాలువకు మరమ్మతులు చేయాలని దువ్వూరు ప్రజలు కోరుతున్నారు.

# వికసిత భారత్ భ్రమలు వాస్తవాలు

**ప్రొద్దుటూరు మే 2 ప్రభాతవార్త**

వికసిత భారత్ భ్రమలు వాస్తవాలు అనే అంశం కేంద్రంగా ప్రొద్దుటూరు సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం పదిగంటలకు స్థానిక తొగటవీర క్షత్రియ కళ్యాణ మండపంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు ఫోరం ప్రతినిధి డాక్టర్ మల్లెల భాస్కర్ తెలిపారు. శనివారం వారు విలేకరులతోమాట్లాడుతూ ఈ సదస్సుకు ప్రముఖ పాత్రికేయులు రాజకీయ ఆర్థిక విశ్లేషకులు డాక్టర్ పరకాల ప్రభాకర్ రావు ముఖ్యఅతిథిగా విచ్చేయుచున్నారు. ఈ సదస్సులో భారత వర్తమాన రాజకీయ ఆర్థిక సాంస్కృతిక విషయాలపై చర్చించనున్నారు. రాజ్యాంగ వ్యవస్థలు ఉనికిని కోల్పోయి అధికార కేంద్రానికి బానిసలు అవుతున్న తీరుపై విశ్లేషించనున్నారు. ముఖ్యంగా ఎన్నికల వ్యవస్థ, శాసన వ్యవస్థ ,న్యాయవ్యవస్థపై దేశంలో రోజురోజుకు విశ్వసనీయత కోల్పోవడం ప్రజాస్వామ్య వ్యవస్థ పతనమును సూచిస్తుందన్నారు. భారత పౌరులు అందరూ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేపట్టవలసిన కర్తవ్యం గురించి ఈ సదస్సులో ప్రభాకర్ రావు వెల్లడించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సును ప్రొద్దుటూరు పట్టణ ప్రజలు మేధావులు వ్యాపార వర్గాలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు .ఈ సమావేశంలో సిటిజన్ ఫోరం ప్రతినిధులు లెక్చరర్లు ఉపాధ్యాయులైన శ్రీనివాసులు, రషీద్ ఖాన్, జగదీష్, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

